సృజన సాహిత్యం

మానవత్వ విలువల మూట

'దార్ల మాట'

అన్ని కాలాల్లోనూ సాహిత్యం.. సమకాలీన జీవనశైలిని, సమస్యలను ప్రతిబింబిస్తూ మనిషి అనుభవాలను, భావోద్వేగాలను మరియు సమాజాన్ని ప్రతిబింబిస్తుంది.కనుకనే సాహిత్యం నిత్య నూతనంగా ఉంటుంది. తమ తమ భావజాలాన్ని, అనుభవాలను సమకాలీనతతో ముడిపెట్టి మానవతా పరిమళాలను పాఠకులు ఆస్వాదించే విధంగా, వివిధ సాహిత్య ప్రక్రియలలో కవులు, రచయితలు రచనలు చేస్తారు. వారు వివిధ ప్రక్రియలలో రచనలు చేసినప్పటికీ పద్య ప్రక్రియలో రచన చేయాలన్న జిజ్ఞాస ఎక్కువమందిలో ఉంటుంది.

అలాంటి ప్రత్యేకమైన ఆసక్తితో ఆటవెలది ఛందస్సులో సమకాలీన సమాజాన్ని ప్రతిబింబిస్తూ శతాధిక పద్యాలు రాసిన వారిలో ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు ఒకరు.

"దారి పూల తోట దార్ల మాట" అనే మకుటంతో 165 పద్యాలతో 'దార్ల మాట' శతకాన్ని రచించి, గణేష్ దినపత్రిక సంపాదకులు శ్రీ కొత్తూరు సత్యనారాయణ గుప్తకు అంకితమిచ్చారు. ఈ శతకంలో తెలుగు భాష ప్రాధాన్యత, సమకాలీన సామాజిక వాస్తవికతలు ప్రతిఫలిస్తాయి.

అవసరమైనప్పుడు ఇతర భాషలు మాట్లాడవచ్చు కానీ మాతృభాషను మర్చిపోరాదని, మాతృభాష..అమ్మ మాటలా అమృతంలా ఉంటుందని, తెలుగు భాష ప్రపంచం నలుమూలల వ్యాపించిందని, తెలుగు భాష గొప్పతనాన్ని కొనియాడారు..ఈ క్రింది పద్యంలో:

"మాతృభాష కొరకు మరణించి వీరులు
మాతృభాష మహిమ మనకు తెలిపె
మాతృభాష నెపుడు మరువకు సోదరా!
దారి పూలతోట దార్ల మాట"

అని హితవు పలికారు. దీనిలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ నేపథ్యాన్ని కూడా గుర్తుచేస్తున్నారు.

భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత ఏర్పాటైన పాకిస్థాన్..పశ్చిమ పాకిస్థాన్, తూర్పు పాకిస్థాన్ లుగా ఉండేది. పశ్చిమ పాకిస్థాన్ లో ఉర్దూ, తూర్పు పాకిస్థాన్ లో బెంగాలీ భాషలను ప్రజలు అత్యధికంగా మాట్లాడేవారు. కానీ రెండు చోట్లా ఉర్దూనే అధికార భాషగా ప్రకటించారు. తూర్పు పాకిస్థాన్ ప్రజలు తమ బెంగాలీ భాషను కనీసం రెండవ జాతీయ భాషగానైనా ప్రకటించాలని కోరారు. పాకిస్థాన్ ప్రభుత్వం అంగీకరించలేదు. దానితో ఢాకా విశ్వవిద్యాలయంలో తమ మాతృభాష బెంగాలీ కోసం ఉద్యమాలు చేస్తుండగా, ప్రభుత్వం కాల్పులు జరిపింది. ఆ కాల్పుల్లో నలుగురు మరణించగా, అనేకమంది గాయపడ్డారు. ఉద్యమ ఉధృతిని గమనించి బెంగాలీ భాషను తమ రాజ్యాంగంలో ఒక జాతీయ భాషగా గుర్తించింది పాకిస్తాన్ ప్రభుత్వం.

ఈ ఉద్యమాన్ని ఆధారంగా చేసుకునే యునెస్కో ప్రతి యేడాది ఫిబ్రవరి 21 వ తేదీన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రకటించింది. ఇంత నేపథ్యమున్న మాతృభాషను మరిచిపోవద్దని అంటున్నాడు కవి. అయితే ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను అనుసరించి ఆంగ్ల భాష నేర్చుకోవాల్సిన అవసరాన్ని చెబుతూ ఆంగ్ల భాష మంచినీరు వంటిదని, తెలుగు భాష తేనె వంటిదని, మంచినీళ్లతోనే మనకు దాహం తీరుతుందని, నేటి సమాజంలో ఆంగ్ల భాష ప్రాముఖ్యతను కూడా మరొక పద్యంలో తెలిపారు.

మనిషి మనుగడకు సహజవాయువు ఎంత అవసరమో నీరు కూడా అంతే అవసరమని, నీటిని వృధా చేయకుండా ఇంకుడు గుంటల ద్వారా పరిరక్షించు కోవాలని తెలిపారు. మన దైనందిన జీవితంలో నిద్ర లేచింది మొదలు పడుకునే వరకు నీటిని వాడటంతోపాటు, నీటిని వృధా చేయవద్దని తెలుపుతూ ఒక పద్యంలో వర్ణించారు.

"గడ్డమెపుడు గీయ నడ్డదిడ్డంబుగాను
వ్యర్థముగను నీళ్లు వదులు చుంద్రు
కొద్ది నీళ్ళే కోట్ల గొంతు తడిపె చూడు"

అని నీటి ఎద్దడి వల్ల కొన్ని ప్రాంతాల్లో తాగడానికి నీళ్లు కూడా ఉండవు. నీరు పుష్కలంగా దొరికే వాళ్ళు నీటిని అనవసరంగా వృధా చేయవద్దని కవి ప్రబోధించారు. కొన్ని నీళ్ళే కదా అనుకుంటారు. కానీ ఇలా చిన్న చిన్న పనుల్లో చేసే నీటి వృధా సామాన్యమైంది కాదు.

మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే. ఈ నాగరిక సమాజంలో కుటుంబ బంధాలు, అనుబంధాలను గురించి అమ్మానాన్న, అక్క, చెల్లి ,తమ్ముడు..ఇలా రక్తసంబంధాల మధ్య ఆర్థిక సంబంధాల కంటే, మమతానుబంధాలకు అత్యధిక ప్రాధాన్యం ఉంటే ఆ ఇల్లు ఎంతో చక్కగా ఉంటుందని తెలుపుతూ...

"కలిమి లేములన్ని కష్ట సుఖములట్లు
తల్లి దండ్రి యన్న దమ్ములుంద్రు
రక్త బంధ మదియె రాదేదియును సాటి"

రక్తసంబంధం యొక్క గొప్పతనాన్ని, ఆవశ్యకతను నొక్కి చెప్పారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను ఆదరించాలని, వారి నుండి అన్నీ దక్కిన తర్వాత వారిని విడిచిపెట్టే లోక రీతిని తప్పు పట్టారు.

ఎంతటి వారికైనా మరణం తప్పదని మట్టి నుండి పుట్టిన మనిషి మట్టిలోకి చేరిపోతాడనే తాత్త్విక స్పర్శను వివరిస్తూ..

"ఏరులన్ని పారి ఎచ్చట కలియును?
సాగరమున చేరి శాంతి నొందు
మానవుండు మరల మట్టి నటులె చేరు"

అని దార్ల కవి పలికారు. ఈ లోకంలో మానవుని జీవితమెంత బుద్భుధప్రాయమో గుర్తు చేస్తూ, జీవించి ఉన్నంతవరకు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రబోధిస్తున్నాడు.

విలువల గురించి తెలియజేస్తూ.. వ్యక్తులు గాని, వస్తువులు గాని అవి ఉన్నప్పుడు వాటి విలువ తెలియదని, అవి లేనప్పుడే వాటి విలువ తెలుస్తుందని, తినడానికి తిండిలేని వాడికి భోజనం విలువ తెలుస్తుందని, అరగని వాడికి ఆరోగ్యం విలువ తెలుస్తుందని చక్కని సామ్యాన్ని ప్రబోధించారు. నేటి నాగరిక జీవనంలో ఆరోగ్యం కోసం తినే తిండి కంటే మింగే మాత్రలే ఎక్కువ ఉన్నాయని, చక్కెర వ్యాధి ముదిరిన తర్వాత మనిషి తీసుకునే చికిత్స గురించి చెప్తూ..



"తినక ముందు నొకటి తిన్నప్పుడొక్కటి
పొదుచుకొనవలయును జదుచుకొనక
మనల జంపు సఖియె మధుమోహనాంగిరా"

అని ఆ బాధలు వర్ణనాతీతమని పలికారు. నేడు పరిశోధనలు ఎన్ని జరుగుతున్నా, కొన్ని వ్యాధులను శాశ్వతంగా నయం చేయలేని స్థితిని వివరిస్తున్నారు.

సాహిత్య పఠనం మనిషిలో సహృదయతను నింపుతూ మనిషిని సంస్కరిస్తుందని సాహిత్య ప్రయోజనాన్ని చెప్పారు. పాఠకులు మంచి రచనను మరువలేరని అంటారు. దీన్నిలా వర్ణిస్తూ...

"కలిమి లేములన్ని కావడికుండలు
ఒడిదుడుకులు తెలిపి ఓర్పు నిచ్చి
సత్వ గుణము నేర్పు సాహిత్యపఠనంబు"

అని సాహిత్యపఠనం యొక్క ఆవశ్యకతను దార్ల కవి తెలియజేశారు.

రాయలసీమ..సాహిత్యానికి, కళలకు, ఆధ్యాత్మికతకు పుట్టినిల్లని, తిరుపతిలో శ్రీ వేంకటేశ్వరస్వామి, కాణిపాకంలో గణపతి సిరులు కురిపిస్తున్నారని, లేపాక్షి బసవన్నను చూడడానికి దేశ విదేశాల నుండి భక్తులు తరలి వస్తారని, అందువల్ల అది కరువు నేల కాదు కళలకు పుట్టినిల్లని అభివర్ణిస్తూ..

"ఊటలూరు పోతులూరి తత్త్వ జ్ఞాని,
రాజ్య మేలినట్టి రాయలుండె
రాళ్లసీమ కాదు రతనాలసీమరా"

అని రాయలసీమ గొప్పతనాన్ని ప్రశంసించారు కవి.

తెలుగు సాహిత్యంలో విశ్వకవి గుర్రం జాషువా ప్రభావం సామాన్యమైంది కాదు. తన కాలంనాటి వాళ్ళను మాత్రమే కాకుండా తరువాత అనేక తరాల వాళ్ళను కూడా ప్రభావితం చేస్తున్నాడు. ఆయన రచించిన సాహిత్య విశిష్టత అంత గొప్పది. జాషువా సాహిత్యాన్ని గురించి వర్ణిస్తూ...

"కవిత పద్యమైన కమనీయ భావంబు
వస్తువేది యన్న, వాస్తవమ్ము
జాతి మేలుకొలుపు జాషువా కవనంబు"

అని జాషువా పద్యంలోని సమకాలీన సామాజిక వాస్తవికతను ఈ పద్యంలో దార్ల కవి వర్ణించారు.

సాహిత్యంలో రూపం ప్రధానమా? సారం ప్రధానమా అని ఒక చర్చ విస్తృతంగా జరిగింది. ఛందోబద్ధమైన పద్యంలోనే తన సాహిత్యాన్ని అత్యధికంగా రచించినప్పటికీ సారంలో చూస్తే సామాజిక వాస్తవికతే జాషువా సాహిత్యానికి ఆత్మ. ఇంతే కాకుండా, నాగరిక జీవనాన్ని, కుల జాడ్యాన్ని, స్త్రీ గొప్పతనాన్ని, సమాజంలో రోజురోజుకీ మరింతగా వ్యాపిస్తున్న కుల వివక్షతను కొన్ని పద్యాల్లో వర్ణించారు.

సమకాలీన నాగరిక జీవన విధానాన్ని, కనిపించీ, కనిపించని సామాజిక పొరలలో ఓటుకు నోటు, నోట్ల రద్దు నాటి అవస్థలు, నల్లధనం, లోనుల పేరుతో బడా బాబుల బ్యాంక్ దోపిడీలు, ఎన్నికల సమయంలో హడావిడి వంటి అనేక సామాజిక అంశాలను కవి ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు తన పద్యాలలో ప్రస్తావించి ప్రశ్నించారు.

ఆచార్య దార్ల..ఈ శతకంలో, ఛందోబద్ధమైన పద్యంలోనే రచన చేస్తున్నప్పటికీ ఆధునిక వచన కవిత్వం కంటే సరళ సుందరంగా పద్యాలు కొనసాగడం ఈ కవి రచనాశైలిలోని విశిష్టత. తన పద్యంలో అలవోకగా ఇంగ్లీషు పదాలు కూడా కలిసిపోయి, నిత్య వ్యవహారంలో కనిపించే తెలుగు భాషా సౌందర్యాన్ని నిక్షిప్తం చేశారు.

'దార్ల మాట' శతకం నిండా మన చుట్టూ ఉండే అనేక సమస్యలతోపాటు, మన మానసిక సంఘర్షణలు పద్య రూపంలో కనిపిస్తాయి. కవి సామాజిక ప్రయోజనాన్ని కూడా తన రచనలో చూపించాలని అనుకున్నప్పుడు ఏ రూపంలో రచనను కొనసాగించినా, దానిలోనూ తన దృక్పథాన్ని ప్రదర్శించవచ్చు. ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు సాహిత్య విమర్శకుడిగా, పరిశోధకుడిగా ప్రసిద్ధి. ఆ తర్వాత వచన కవిగా కూడా అనేక కవితలు రచించారు. కానీ ఆధునిక కాలంలో పద్యాన్ని కూడా ఇంత సరళంగా రాయడం ఈ శతకంలో కనిపించే ప్రత్యేకత. ఒకవైపు పరిశోధన, సాహిత్య విమర్శను విస్తృతంగా రాస్తూనే, మరొకవైపు వచనకవిత్వంతోపాటు పద్యాన్ని, సామాజిక ప్రయోజనం కలిగే మరెన్నో రచనలు చేస్తున్న ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అభినందనీయులు.

-అనిల్ కుమార్ దారివేముల
99512 44718.

ఇప్పుడేదీ దారి !

ఎవర్ని తప్పు పట్టాలిప్పుడు
వారించినా వదలని స్వేచ్ఛా వీచికల్నా...
కోరి మరీ వరించిన మాతృస్వామ్యాన్నా...!!

రక్షణ గోడల్ని ఛేదించి
లోకంతో విభేదించి
సాధించిందేవిటీ..!!

ముళ్ళూ,అరిటాకుల సామెతలు
పాతబడ్డాయి..!!

జీవితాన్ని పండించిన
నిన్నటి ఉత్సవాల్ని
నీ చేత్తోనే నిర్మూలించి,
నిబంధనల పరదాలు చీల్చుకుంటూ
ఏ చీకట్లోకీ ఈ పరుగులు...!!

ఇక ఏ రహస్యాన్నీ దాచలేని
ఆ గాజు తలుపుల వెనుక
పొందిందేవిటీ...
పోగొట్టుకుందేవిటీ..!!

లాలిత్యానికి లాలపోసిన చెయ్యి
కరకు దుప్పట్లో మరకల్ని దాస్తోంది..!!
సడలిన కేశాల కేళిలో
తన చితి పేర్చుకుంటున్న సతి
వికృత రూపం
ప్రకృతి ధర్మాన్ని ప్రశ్నిస్తోంది !!

దుఃఖపు గనుల్లో ఎండు పూల ఖజానాని
ఇక ఎవరు ఖాతరు చేస్తారు !!

అమ్మబాహువుల్లో సేదదీరే
లోకానికిప్పుడేదీ దారి !!

-వి. లక్ష్మీ భవాని,
99516 35215

అక్షర కలశం

చాలా రోజులు అల్మారా
సగం నిద్ర
మేలుకొన్న అక్షరం మగతలో
తొంగిచూసే అద్దాలగుండా ఆశ్చర్యంగా
ఆకలిగొన్న పాఠకుడు ఎదుట
ఎవరూ చూడని పుస్తకం
పేజీలు తెరుచుకుంది ఆబగా

ఒక అద్భుతం చూసిన దృశ్యం
కనుల నీటి వాన
తడిసిన సృజనాక్షరం పేజీలన్నీ ఆలోచనలో
నిద్రలో ఆల్మారాలో ఉన్న కథ కవిత
నన్ను ఎవరూ చూడలేదనో స్పృశించలేదనో
బాధ భ్రమల వొర చేరలే

పైగా తనే
కొత్తశక్తిలో లేచిన కిరణాలై
మనసున్న చదువరిని పిలిచింది
చూడని ఇష్టపడని
కళ్ళను తడిమింది ఆర్ద్రంగా
అబ్బురంగా పేజీలన్నీ
చదివిన పుస్తకమైన చిరునవ్వు

అర్థంకాని విషయం కాదుగానీ
ఆకలికీ దాహానికీ ఆహ్వానం అక్కర్లేదు
అన్నం కోసం చిన్న పుస్తకం కోసం
తెరిచిన తలుపులగుండా
మూసిన రెప్పల చప్పుడు

మౌనంగా కలిసిన హృదయాలు
నాముందు అక్షర కలశం
జ్ఞానసుధల తపన

-డా.టి.రాధాకృష్ణమాచార్యులు
98493 05871

తెగిన పతంగాలు

తీరొక్క పూలతో తీరైన కాయలతో
గుత్తులుగుత్తులుగా కొత్తకొత్త విత్తనాలు
కొమ్మకొమ్మకూ రెమ్మరెమ్మకూ
నిత్యం రెపరెపలాడే రసరమ్య పక్షులు!

అనుబంధాలను ఆప్యాయతలను
అపురూపంగా అల్లుకున్న తీవెలు!
మమతానురాగాల పరిమళాలను
మురిపెంగా వెదజల్లిన మల్లెల తావులు!

ప్రపంచీకరణంలో పావులై
బ్రతుకు తెరువులో గోవులై
చెర్నాకోల చురక చరుపులతో
చెల్లాచెదురైన చతుర చకోరాలు!

ఆపద సంపదల్లో పాలుపంచుకొని
వలసపోయిన అలసకన్యలు
పరవశంగా పదేపదే తలచుకొనే
మధుర విషాద మానస పావురాలు!

ఊడలమర్రిని విధిలేక వీడి
బీడు ఎడారుల్లో బిత్తిరి బిడారులై
బంజరు ఎండమావుల వెంబడి
వేలంవెర్రిగా పరుగులు తీస్తున్న ఒడలు!

తెగిన పతంగాల తెలివిడికోసం
పాడవే పాడవే ఓ కోయిలా
పాషాణ భరిత హృదయాలలో
ప్రేమలతలు శాశ్వతమై చిగురించి
పురాజ్ఞాపకాల పందిరిని పరవశంతో పాకేలా!

-కరిపె రాజ్ కుమార్
81251 44729

లోక కళ్యాణం కోసం "హరిత స్వప్నం"

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం నీళ్ళు, నిధులు, నియామకాలు అనే మూడు ప్రధాన సమస్యలతో ముడిపడింది. ఈ మూడింటిలో మొదటిదైన నీళ్ళు నేపథ్యంగా ఈ 'హరిత స్వప్నం' కవితా సంపుటి వెలువడింది. నీళ్ళు, పంట పొలాలు, ప్రాజెక్టులు, చెట్లు - వీటి ఆవశ్యకతను చాటి చెప్పింది ఈ కవితా సంపుటి.

దేశంలో నిత్యం జరుగుతున్న ప్రజా వ్యతిరేక సంఘటనలపై ఈ కవి కవిత్వమై ప్రశ్నిస్తుంటారు. మేము హన్మకొండలో డిగ్రీ చదివే రోజుల్లో సాహిత్య మిత్రులం చర్చించుకునేవాళ్లం - సి. నారాయణరెడ్డి రోజు ఒక కవిత అయినా రాయందే నిద్రపోరని. నిజానికి కోట్ల..సి.నారాయణరెడ్డి శిష్యుడని నిరూపించుకున్నారు. "కవి మట్టిలో దాక్కున్న విత్తే / గుండె తడిసిందా / కొత్త మొక్కయి మొలుస్తాడు". రోజూ అలా మొలుస్తూ కవిత్వ వృక్షమై ఎదిగిన కవి కోట్ల వెంకటేశ్వర రెడ్డి.

నీరు, చెట్టు అవి ఏ రూపంలో ఉన్నా సకల జీవరాశుల ప్రాణాలను నిలబెడుతవి. నీరు, అది ఒక చినుకైనా, కాలువ అయినా, చెరువైనా, నది అయినా ఆఖరికి సముద్రమైనా జీవరాశుల దప్పికను, ఆకలిని తీర్చడమే దాని లక్ష్యం. అలాగే ఒక గడ్డి పరకైనా, మొక్కైనా, చెట్టైనా, పంటైనా దాని లక్ష్యం అదే. ఇవి నిస్వార్థంగా జీవరాశుల ప్రాణాలను నిలుపుతుంటే ఆ జీవరాశుల్లో ఒకడైన మానవుడు వీటిని విధ్వంసం చేస్తున్నాడు.

ఈ సంపుటిలో కవి ఆవేదనంతా దాని చుట్టే తిరుగుతుంది. "స్వప్నాలు ఫలించాలంటే / మనిషి చెట్టయిపోవాలి / అనుభవాల ఆకులు రాలందే / ఎవరి గుమ్మం పచ్చబడదు" అని కవి..మనుషులను చెట్టును చూసి, నీటిని చూసి మారమంటున్నాడు. ప్రతి మనిషి చెట్టును నేల మీద నాటేకన్న ముందు ఎవరి ఎదలో వారు నాటుకోవాలని సూచిస్తున్నాడు. ఎందుకంటే మనం ఏ పనైనా మొక్కుబడిగా కాదు గుండె లోతుల్లోంచి చేయాలి. అలా అయితేనే ఫలితం ఉంటుంది.

అందుకే "కాలానుగుణ గమనశీలత నీలో కొరవడిందా / జీవితం నీకు మోయలేని భారమవుతుంది !" అని హెచ్చరిస్తున్నాడు.

ఒకప్పుడు మహబూబ్ నగర్ జిల్లా కరువుతో విలవిలలాడింది. వలసలతో చచ్చిపోయింది. కానీ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత "మండు వేసవిలో / అలుగెత్తుతున్న వందేళ్ళ ఘణప సముద్రం / బిడ్డను చంకలో పెట్టుకుని దేశమంతా తిరిగాం" - గతం, వర్తమానం కళ్ళముందు ఆవిష్కరిస్తున్నాడు కవి. "అలుగెత్తిన చెరువు ఎన్ని కలలు పండిస్తుందో / ఇకపై కరువొక చేదు జ్ఞాపకం". "విడిపోతే / అంతా చీకటిమయమే అన్నవాళ్లు / ఈ వెలుగులను ఏ కంటితో చూస్తారు ? అని ప్రశ్నిస్తూ నిలదీసి రాసిన హరిత పత్రం ఇది. "ప్రతి ఉగాది ఆకుపచ్చని కలనే కంటది / మనమే స్వార్థమై మొలచి ధ్వంస రచనకు పూనుకుంటున్నాం / ఇకపై చెట్టు మొదళ్ళ దగ్గర చెంబెడు నీళ్లై ప్రవహిద్దాం" - అంటూ మనుషుల్లో పర్యావరణ స్పృహ కలిగిస్తున్నాడు కవి.

"మూలకు కూర్చున్న ఆ మట్టి కుండ కూడా / నా దాహానికి చలువ పందిరి వేస్తున్నది / చెట్టు చేస్తున్నది ఒంటికాలి తపస్సు / దాని స్వార్థానికా కాదు లోక కళ్యాణానికే" . మరి ఎంత ఎదిగినా చెట్టుకు, నీటికీ ఉన్న విశ్వాసం మనిషికి ఎందుకు లేదని కవి దగ్ధమవుతున్నాడు.

"నేల పచ్చగున్నంతవరకే / మన ఆటలు రక్తి కట్టిస్తాయి" అంటూ మన తప్పును మనకు ఎరుక పరుస్తూ హెచ్చరిస్తున్నాడు కవి.

"కుర్చీ దిగనున్న సత్య హరిశ్చంద్రుడు / కొత్త అబద్ధాలు ప్రాక్టీస్ చేస్తున్నాడు / ప్రత్యర్థులేమి తక్కువ తినలేదు మాట తప్పిన ఘటనలను పూస గుచ్చుతున్నారు". ఈ కవిత 2018లో రాసింది అనుకుంటా కానీ ఇప్పటికే కాదు ఎప్పటికీ ఇది సజీవమే.

"వాగ్దాన భంగానికి ఇకపై ప్రతిఫలం / పాతాళ లోకం అంచులు చూడటమే" - నాయకులు చదవాల్సిన కవితలు ఇవి. "నేరగాళ్ళను చట్టసభలకు పంపి / దిష్టిబొమ్మలు తగలేస్తే ఏం ప్రయోజనం ?" అని ప్రజలను చైతన్య పరుస్తున్న కవి కోట్ల. రాజకీయ నాయకుల వ్యూహరచనలు ఎన్నికల్లో గెలవడానికే. ప్రజల ఆకాంక్షలు వారికి సందుకలో దాగిన తాళపత్రాలే అంటూ కవి కుండబద్దలు కొట్టాడు.

గాంధీ పై కవిత్వం రాస్తూ "మృగాలు అంతరిస్తున్న కొద్దీ / మనిషి రక్తం రుచిమరుగుతున్నాడు" - మనుషులు ఒకప్పుడు అడవుల్లో జంతువులను వేటాడేవారు. ఇప్పుడు అడవులు లేవు, జంతువులు కూడా లేవు. కానీ ఆ వేట మనిషి డి.ఎన్.ఏ లో ఉండిపోయింది. మనుషులు తోటి మనుషుల్ని మృగాల్లా వేటాడుతున్నారు. నిజంగా ఇది సీరియస్ గా ఆలోచించాల్సిన విషయమే. "మహాత్మా నీ సబర్మతి ఆశ్రమం కూడా / ఇప్పుడు ఎవరికీ స్ఫూర్తి కేంద్రం కాదు / రేటింగ్ ను పెంచే / ఒట్టి దర్శనీయ క్షేత్రమే". వర్తమానం గాంధీని ఒక చైతన్య కెరటంలా కాకుండా పురావస్తు కేంద్రగా చూస్తున్న సందర్భం మనం ఎక్కడ దారి తప్పామో స్పష్టంగా చెబుతుంది.

కోట్ల వెంకటేశ్వర రెడ్డి ఇప్పటికే 17 కవితా సంపుటాలు వెలువరించారు. వీరి మొదటి కవితా సంపుటి 'గుండె కింద తడి'.



సుమారు 40 సంవత్సరాల క్రితం వెలువడిన ఈ కవితా సంపుటికి నేటికీ ఆధునికంగా అనిపిస్తున్న ఈ పేరు ఆ రోజుల్లోనే పెట్టారు అంటే వారిలోని ఆధునికతను మనం అర్థం చేసుకోవచ్చు.

అందుకే కవి ఇప్పటికీ అంటున్నాడు "నేను సమూహంలో ఒంటరినే / అక్షరమై మొలకెత్తుతానా / నా జాతి స్వరాన్నై" ఇప్పటికీ వారి కలం పదును మీదనే ఉన్నది. "పద్యానికి కుట్రలు తెలియవు / కుట్రల్ని భగ్నం చేయడమే దాని పని / నేతలు గడ్డిమేసినట్టు పద్యం మౌనాన్ని మేయదు". మౌనంగా ఉండలేని వారి తనమే ప్రతిరోజు వారితో కవిత్వం రాయిస్తుంది. ప్రజల పక్షాన నిలదీస్తున్నది. "వెలుగునూ వేడినీ / ఎట్టైనా రాజేస్తా / నిలిచే అక్షరమై / చివరి వరకు నినదిస్తా" - అందుకే ఈరోజు వరకు కూడా వీరు అగ్రశ్రేణి కవిగా నిలబడగలిగారు.

"సహస్ర బాహువుల రాజ్యం / ఒక్క అక్షరానికి ఇంతగా ఒణకడం / కవిగా నాకు గర్వంగా ఉంది" - కవి కోట్ల..కాళోజీ పురస్కార గ్రహీత కనుక కాళోజి రాసిన ఒక కవితా వాక్యం ఇక్కడ చెప్పుకోవాలి. 'ఒక సిరా చుక్క లక్ష మెదళ్ళ కదలిక' అన్నారు కాళోజీ. దానికి కొనసాగింపే వీరి ఈ కవిత.

నిజానికి కవికి రాజ్యం భయపడుతుంది. అసలు రాజ్యానికి నిజమైన, నిఖార్సైన శత్రువు కవి మాత్రమే. కవి రాసిన ఒక్క అక్షరం చాలు ప్రజలను ఉద్యమకారులుగా మార్చగలదు. పది సంవత్సరాల క్రితం ఇది మన అనుభవంలోనిదే. మరి ఈ కవిత్వం ఊరికే వస్తుందా! రాదు. పగటికల అంతకన్నా కాదు. "రాత్రంతా మేల్కొనందే / పొద్దున ఒక పద్యం నన్నులుకోదు" కవి యాతన ఇది.

ఈ సంకలనంలో వీరు అమ్మ మీద రాసిన కవితలు కూడా ఉన్నవి. అవి వేటికవే ప్రత్యేకత కలిగి పాఠకులను ఆలోచింప చేస్తాయి. "మీ అమ్మేది అని ఎవరైనా అడిగితే / గోడకు వేలాడే చిత్రపటాన్ని చూపకండి / పళ్లెం నిండా ఇంత అన్నం పెట్టి అమ్మను చూడమనండి"- అమ్మకు ఇంతకన్నా నిర్వచనం మరేదీ ఉండదు. మరో కవితలో "మనుమడు / వేలడంత కూడా లేడు / కోపమొస్తే / నీ యమ్మ అంటడు". "అమ్మగా నువ్వు దేనికి పనికొస్తావే / ఒట్లకు / అడ్డమైన తిట్లకు తప్ప". ఇది ఎంత బాధాకరం.

అర్థవంతమైన వాక్యం ఒక్కటే చరిత్రలో దారి దీపమవుతుంది అని తెలిసిన కవి కోట్ల. పర్యావరణ స్పృహ కలిగిన ఈ కవిత్వం ఇతర భాషల్లోకి కూడా అనువాదం కావాల్సిన అవసరాన్ని ప్రస్తుత పరిస్థితులు నొక్కి చెప్తున్నాయి.

ప్రతులకు : పాలపిట్ట బుక్స్, బాగ్ లింగంపల్లి,
హైదరాబాద్. వెల రూ.120/-.
కవి సెల్ : 94402 33261

- ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్
98490 82693



కార్టూన్ల పోటీ

ప్రముఖ సాహితీవేత్త మామిడిపూడి రామకృష్ణయ్య గారి స్మారకంగా విశాలాక్షి సాహిత్య మాసపత్రిక నిర్వహణలో రూ.50 వేల విలువగల కార్టూన్ల పోటీ (మొత్తం బహుమతుల విలువ 50వేలు). మొదటి, రెండవ, మూడవ, నాలుగవ మరియు ఐదవ బహుమతులు వరుసగా రూ.6000/-, 5000/-, 4000/-,3000/-,2000/-. మరియు ముప్పై ప్రత్యేక బహుమతులు ఒక్కొక్కటి రూ.1000/-లు. ఒక్కొక్కరు రెండు కార్టూన్లు పంపవచ్చును. స్త్రీలను, వికలాంగులను, సమాజ కట్టుబాట్లను కించ పరిచే కార్టూన్లు పోటీకి అంగీకరించబడవు. కార్టూన్లు ethakotas@yahoo.comకు మార్చి 30, 2025 లోగా చేరాలి. మరిన్ని వివరాలు 8008562742 మెసేజెస్ ద్వారా పొందవచ్చు.

-ఈతకోట సుబ్బారావు
సంపాదకుడు విశాలాక్షి నెల్లూరు

నిర్వహణ :
విల్సన్‌రావు కొమ్మవరపు
సాహితీ సంపాదకులు
k.wilsonrao@gmail.com